క్లుప్తంగా

రేపు హుండీ లెక్కింపు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 8న బుధవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మరాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయంలోని కల్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

బీజేపీలో చేరిక



తరిగొప్పుల: ప్రధాని నరేంద్రమోదీ సాహసోపేత నిర్ణయాలు, దేశం పట్ల నిబద్ధత, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై యువత బీజేపీ చేరడం జరుగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొత్తలపర్రె గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు.ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించుకోవాలన్నారు. చేరిన వారిలో రాజకుమార్, వెంకన్న, వీరస్వామి,రాజు, వీరన్న, రామస్వామి, సంపత్, కుమార్ ఉన్నారు. నునుగొప్పుల మహేష్, రాంనర్సింహారెడ్డి,కొన్నె రాజు ,చిలువేరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లో సత్తా చాటాలి

లింగాలఘణపురం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సదానందం కోరారు. సోమవారం నవాబుపేటలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోట్లతో ఓట్లు కొనే అభ్యర్థులను తిరస్కరించి ప్రజా సమస్యలపై పోరాడే వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కొలిపాక రవి, తూడి గొండ సహదేవ్, కారె ఐలయ్య, బి.కనకరాజు, కుమార్, నరేశ్, పరశురాములు, బాబు, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

కొడకండ్ల: కొడకండ్ల మండలం చెరువుముందు తండాకు చెందిన ధరావత్ రేఖ్యానాయక్(65) కిడ్నీ నొప్పి భరించలేక సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. రెండేళ్లకు పైగా రేఖ్యానాయక్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాక నొప్పి పెరిగిపోయింది. కిడ్నీ నొప్పి భరించలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఆగమ్మ, ఐదుగురు వివాహమైన కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థికి చేయూత



చేయూత అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తొర్రూరు రూరల్: ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి ధర్మారపు లోకేష్‌కు మాస్ సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేల నగదును అందించి సోమవారం చేయూతనిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి, ప్రభుత్వ వైద్యాధికారి అలువాల విజయ్‌కుమార్, రాయిశెట్టి యాకేందర్, ధర్మారపు నాగయ్య పాల్గొన్నారు.

చెరువు నిండితే రాకపోకలకు ఇబ్బంది

- నీటి నిల్వతో పేరుకుపోయిన పాకురు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- మినీ వంతెన నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి



బంజర చెరువు నీటి నిల్వలతో రోడ్డు కల్వర్టు దారి

దేవరుప్పుల: చెరువు నిండితే పలు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులతోపాటు నిత్య ప్రమాదాలకు నిలయంగా బంజర రోడ్డు డ్యామ్ పరిస్థితి నెలకొంది. మండలంలోని చిన్నమడూరు రెవెన్యూ పరిధి బంజర గ్రామం ఆనుకొని చెరువు ఉంది. వర్షం కాలం వస్తే చాలు చెరువు నిండుకుని రోడ్డు డ్యామ్ వద్ద నాలుగు నెలల పాటు నీటి నిల్వలు పేరుకపోయి పాకురు పడుతోంది. దీంతో చిన్నమడూరు, అప్పిరెడ్డిపల్లె, కోలుకొండ,చౌడూరు, రంబోజీగూడెం, మాధాపురం తదితర గ్రామాల ప్రజలు సింగరాజుపల్లి బ్యాంకు, ఇతరతర వ్యాపార, వాణిజ్య దుకాణాలకు పెద్దఎత్తున నిత్యం వస్తున్న క్రమంలో రోడ్డు అసౌకర్యంతో చిన్నపాటి వాహనదారులు, పాదచారులు వెళ్లేక్రమంలో జారి పడి ప్రమాదాలకు గురయిన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాదాల నివారణకు మినీ వంతెన కట్టాలని స్థానిక ప్రజలు కోరినా గత ప్రభుత్వం నుంచి నేటి ప్రభుత్వం వరకూ పనుల ప్రతిపాదనలు తప్ప ఆచరణలో రూపుదాల్చిన పరిస్థితి లేదు. చెరువు సామర్థ్యానికి మించి నీరు నిల్వడం, మత్తడి పెంచి నిర్మాణం చేయడం వల్ల బ్యాక్ వాటర్ రోడ్డు డ్యామ్ వరకు చేరుతోంది.

ప్రకటనలకే పరిమితం

చెరువు రోడ్డు డ్యామ్ వద్ద నిత్య ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పాలకవర్గాల హామీలు ప్రకటనలకే పరిమితమవున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు దృష్టిసారించి తాత్కాలికంగా నీటి నిల్వలు లేకుండా చేయాలి. బంజర స్టేజీ నుంచి కోలుకొండ క్రాస్ వరకూ మంజూరైన రోడ్డు పనుల్లో అత్యవసరంగా మినీ వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చేయాలి.



- ధరావత్ శంకర్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు

చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సతీశ్‌గౌడ్

కొడకండ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచి ప్రజలపై భారాన్ని మోపడం తగదని, వెంటనే చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేశగాని సతీశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలును తుంగలో తొక్కిన ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం సిగ్గు చేటని, మోసపూరిత ప్రభుత్వానికి త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకై ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. మాజీ సర్పంచ్ వల్లూరి సైదులు, తాళ్ల శోభన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

'కడియం'ను పర్వతగిరికి పంపుతాం..



కాంగ్రెస్ బాకీ కార్డులను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య తదితరులు

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: తిన్నింటి వాసాలు లెక్కపెట్టే ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఇక రాజకీయ సమాధి తప్పదని.. పర్వతగిరికి పంపడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఊరూరా బీఆర్ఎస్ అభివృద్ధి సంక్షేమాలు, ఇంటింటికి కేసీఆర్ పథకాలు అనే పేరుతో గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గబ్బెటలో రాజయ్య మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల కాలంలో ఇంటింటికీ అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో ఏ ఇంటికి సంక్షేమ పథకాలు అందిన దాఖలాలు లేవన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఆరోపణలు చేస్తే తాట తీస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దమ్ముంటే రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి పోటి చేయాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో కాంగ్రెస్ బాకీ కార్డులను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమార్‌గౌడ్, మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సోదరుడి మృతి



నివాళులర్పిస్తున్న యాదగిరిరెడ్డి తదితరులు

జనగామ: జనగామ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సోదరుడు.. కృష్ణారెడ్డి (84) సోమవారం హైదరాబాద్ మల్లాపూర్ స్వగృహంలో మృతి చెందారు. ఐనవోలు మండలం పున్నేల్‌కు చెందిన ఆయన వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించారు. తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సహకారంతో మూడున్నర దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. స్వగృహంలో గుండెపోటుతో సోదరుడు మృతి చెందారని వార్త తెలుసుకున్న ముత్తిరెడ్డి హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నాడు. భౌతిక ఖాయానికి నివాళులర్పించి, కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈనెల 7న(మంగళవారం) ఉదయం 11 గంటలకు మల్లాపూర్‌లోని వైకుంఠధామంలో అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. ఆయన మృతి పట్ల బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు సంతాపం ప్రకటించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



కృష్ణారెడ్డి(ఫైల్)

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై రాజన్ బాబు

జనగామ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై రాజన్ బాబు సూచించారు. సోమవారం ఎస్సై ఆధ్వర్యంలో పెద్దపహాడ్ బస్టాప్ వద్ద డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదన్నారు. ట్రాఫిక్ సిబ్బంది నాగరాజు, యుగంధర్, ధనుంజయ్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

పోలీస్ కళాజాతా



మాట్లాడుతున్న ఏఎస్సై వెంకటనారాయణ

జఫర్‌గఢ్: వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జాగృతి కళా బృందం ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో పోలీస్ కళాజాతా ఆదివారం రాత్రి నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కళా ప్రదర్శనలో మాదకద్రవ్యాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక, రోడ్డు ప్రమాదాలు, మూఢనమ్మకాలు తదితర అంశాలపై కళాకారులు ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎస్సై వెంకటనారాయణ, కళాబృందం ఇన్‌చార్జ్ ఉమేన్, నాగమణి, విలియమ్స్, రత్నయ్య, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవితో పాటు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో రెండు రోజుల క్రితం భారీ వర్షంతో తడిసిన ధాన్యం, మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మాజీ ఎంపీపీలు మేకల కలింగరాజు, బైరగోని యాదగిరిగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మార్కెట్‌ను సందర్శించి వర్షంతో నష్టపోయిన రైతులను పరామర్శించి, రోజువారిగా ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం క్వింటాల్‌కు కేవలం రూ.1,400 నుంచి రూ.1,500 మాత్రమే పలుకుతుందని, మక్క ధరలు సైతం పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌ను కలిసి తడిసిన ధాన్యం, మక్కల కొనుగోలు, రోజు ధరలపై మాట్లాడారు. రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకోని సమయంలో ఆందోళన సైతం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం శారద, గుర్రం నాగరాజు, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు







క్షతగాత్రులు సోమయ్య, సుశీల, లక్ష్మీనర్సయ్య

జనగామ: వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి జనగామ మండలం పెంబర్తి యూ టర్న్ ఆర్ ఆర్ టిఫిన్ సెంటర్ వద్ద రెండు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ బేగంపేటకు చెందిన పెండోటి సుశీల, పెండోటి లక్ష్మీనర్సయ్య దంపతులు దసరా పండగకు జనగామ పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన బావమర్ది చిలుమోజు సోమయ్య ఇంటికి వచ్చారు. పండగ వేడుకలు ముగియడంతో బావమరిది సోమయ్య కారులో ఈ నెల5వ తేదీన లింగాలఘనపురం మండలం మాణిక్యపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఉదయం ముగ్గురు పట్టణంలోని వీవర్స్ కాలనీకి బయలు దేరగా, పెంబర్తి జంక్షన్‌లో జనగామ వైపు టర్న్ చేస్తున్న క్రమంలో హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో కారు ఢీ కొట్టింది. కారు బెలూన్లు ఓపెన్ కావడంతో సోమయ్యతో పాటు దంపతులకు గాయాలు కాగా, ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ జెండా ఎగరాలి

- జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమేశ్

బచ్చన్నపేట: స్థానిక ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో మండల అధ్యక్షుడు బంగారు మహేష్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామం నుంచి అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉంటున్నారని, అన్ని స్థానాలను గెలపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు బేజాడి బీరప్ప, శశిధర్ రెడ్డి, బల్లా శ్రీనివాస్, తోకల ఉమారాణి, మండల ఉపాధ్యక్షులు రాపెల్లి చక్రపాణి, గద్ద రాజు, జలేందర్, జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, నాయకులు బేజాడి సిద్దులు, గణేష్, చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాగేష్, పరందాములు, సందీప్, సురేష్, రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 'బోనస్' చెల్లించడంలో నిర్లక్ష్యం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య



మాట్లాడుతున్న సోమయ్య

జఫర్‌గఢ్: రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో రైతు సంఘం మండల సమావేశాన్ని నల్లతీగల శ్రీను అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో రైతులు పండించే దొడ్డు, సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. కానీ సన్నరకం ధాన్యానికే బోనస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీనీ ఆచరణలో మాత్రం చూపడం లేదన్నారు. జిల్లాలో 5,715 మంది రైతుల నుంచి 2,54,716 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి వాటికి సంబంధించిన రూ.12 కోట్ల బోనస్ ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు రైతులకు బోగస్‌గా మారాయన్నారు. బోనస్ డబ్బుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు బోనస్ తక్షణమే చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు సముద్రాల దుర్గయ్య, ఎండీ ఖాదర్ బాబు, నర్సింగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



కొడకండ్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధమై మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి సమన్వయంతో ముందడుగు వేస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాగా, ఇటీవల మృతి చెందిన కొడకండ్ల మాజీ సర్పంచ్ ఉప్పల చిన్నసోమయ్యతో పాటు పలువురు బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు రవిందర్, కడారి శివరాములు, మదుసూధన్, యాకయ్య, భిక్షపతి, నాగరాజు, వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఈదయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు తావివ్వకుండా ఇంటింటా సంక్షేమ పథకాల అమలు

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో పైరవీలకు తావివ్వకుండా రాజకీయాలకతీతంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. చిన్నమడూరులో మహిళా నాయకులు పరీదుల అంజమ్మ, మడికొండ లచ్చమ్మ అకాల మరణం పొందగా ఆ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దేవరుప్పుల దాదాసాహెబ్ కాలనీలో బీఆర్ఎస్‌కు చెందిన 30 ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ ధర్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పాండుకృష్ణ, బోనగిరి యాకస్వామి, భాస్కర్‌గౌడ్, దశరథ, ఉప్పుల ఉప్పలయ్య, రసూల్ పాల్గొన్నారు.

పరామర్శ..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ మారం శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శ్రీనివాస్‌ను పరామర్శించారు. అనంతరం మండలంలోని ముత్తారం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోయిని కుమార్ సతీమణి బోయిని లలిత ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే పరామర్శించారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

పాలకుర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో ఎంపీటీసీ పరిధిలోని శాతపురం, అయ్యంగారిపల్లి, దుబ్బతండా నాయకులు, కార్యకర్తలతో బాలరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. చక్రాల రఘు, ఎన్నికల ఇన్‌చార్జ్ రాంచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి'



పాలకుర్తి: మాట్లాడుతున్న నవీన్



బచ్చన్నపేట: మాట్లాడుతున్న రాంరెడ్డి



దేవరుప్పుల: మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

పాలకుర్తి: బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తారం గ్రామంలో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. సర్వేప్రకారం అభ్యర్థులకు టికెట్లు వస్తాయని అన్నారు. ముత్తారం ఎన్నికల ఇన్‌చార్జ్ బీఆర్ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, చింతకింది ఉపేందర్, మురళీధర్‌రావు, పాడిశెట్టి సురేష్, గాదరి సోమేశ్వర్, గ్యార ఎల్లయ్య, కూనూరు మధు, కర్ర భాస్కర్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తమ్మడపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు దొమ్మాట చందు బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షులు కంసాని సిద్దారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంలో సత్తా చాటాలి

త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల ఇన్‌ఛార్జ్‌లు గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల స్థానాలకు ఒక జెడ్పీటీసీకి 18 మంది, 13 ఎంపీటీసీ స్థానాలకు -76, 26 గ్రామాల సర్పంచ్‌లకు 120 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందన్నారు. మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు ఇర్రి రమణారెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, బావండ్ల కృష్ణంరాజు, మద్దికుంట రాధ, సాగర్‌గౌడ్, కనుకయ్యగౌడ మల్లారెడ్డి, రాజు, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, రాజనర్సు, కనుకయ్య, సిద్దారెడ్డి, మహేందర్‌రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పరిపాలనతోనే పల్లెల్లో సమగ్రాభివృద్ధి

దేవరుప్పుల: బీఆర్ఎస్ పరిపాలనతోనే పల్లెలు సమగ్రాభివృద్ధి చెందాయని ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లి, సీతారాంపురం తదితర క్లస్టర్ గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ పార్టీ అభ్యర్థుల ఖరారు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బస్వ మల్లేషమ్, పీఎసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, అధికార ప్రతినిధి హన్మంతు, జనార్దన్‌నాయక్ గ్రామ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహ పాల్గొన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'



మాట్లాడుతున్న ఐకేపీ సభ్యులు

చిల్పూరు: నాలుగు సంవత్సరాలుగా మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బుక్ కీపర్‌గా పనిచేస్తున్న గాదె శ్రీలత అవకతవకలకు పాల్పడుతోందంటూ సంగీత, ఉష, కళ, కవిత, నాగమ్మ, నలిమెల కుమారస్వామి, గాదె రాజు, రేణుకలు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఐకేపీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం సరిత, నీరజ, తిరుమల, భ్రమరాంభ, హసీన, రమలు మాట్లాడుతూ బుక్ కీపర్‌గా పని చేస్తున్న శ్రీలతపై నేటికీ ఎలాంటి ఆరోపణలు లేవన్నారు.